మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మందమర్రి, మార్చి 4 : మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సింగరేణి సేవా సమితి మందమర్రి ఏరియా అధ్యక్షురాలు జీ స్వరూపారాణి సూచించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సింగరేణి సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం ఆటల పోటీలు నిర్వహించారు. స్వరూపారాణి ప్రారంభించారు. గ్లాస్‌బాల్, బాల్‌స్టా, గ్లాస్ ఆన్ హెడ్, బాంబ్ ఇన్ బ్లాస్ట్ పోటీలు నిర్వహించగా, మహిళా ఉద్యోగులు, ఉద్యోగుల కుటుంబాలు, పరిసర ప్రాంతాలకు చెందిన 200 మహిళలు పాల్గొన్నట్లు అధ్యక్షురాలు తెలిపారు. విజేతలకు మహిళా దినోత్సవ వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కమ్యునికేషన్ సెల్, సేవా సమితి కోఆర్డినేటింగ్ అధికారి, డీవైపీఎం ఎండీ ఆసీఫ్ పాల్గొన్నారు.

రెబ్బెన, మార్చి 4 : బెల్లంపల్లి ఏరియా గోలేటిటౌన్‌షిప్‌లో గల జీటీసీవోఏ క్లబ్(అఫీసర్స్ క్లబ్)లో బుధవారం సాయంత్రం 4 గంటలకు మహిళలకు ఆటలు, పాటలు, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. విజేతలకు మహిళా దినోత్సవం సందర్భంగా గోలేటి సీఈఆర్ క్లబ్‌లో 8వ తేదీన నిర్వహించే వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

జైపూర్, మార్చి 4 : మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించే కార్యక్రమాలపై ఎన్టీపీపీ సేవాసమితి సభ్యులు సమీక్షా సమావేశం నిర్వహించారు. సేవాసమితి అధ్యక్షురాలు, ఈడీ సతీమణి సుమిధ శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహించాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. ఆడిటోరియంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఆటల పోటీలు నిర్వహిస్తామని, పెద్ద సంఖ్యలో మహిళలు హాజరై, విజయవంతం చేయాలని కోరారు. పర్సనల్ అధికారి ఠాకూర్‌మోహన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మారుమూల ప్రాంత ప్రజలకు సేవే ధ్యేయం

బెజ్జూర్, మార్చి 4 : జిల్లాలోని మారుమూల బెజ్జూర్ మండల ప్రజల ప్రయోజనం కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో సింగరేణి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని డీవోఫీవో నీరజ్ కుమార్ టిబ్రీవాల్ అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. సింగరేణి జీఎం విజయభాస్కర్‌తో కలిసి ప్రారంభించారు. కాగజ్‌నగర్, మంచిర్యాల, కరీంనగర్ తదితర కార్పొరేట్ దవాఖానలకు వెళ్లలేని పేదలను దృష్టిలో పెట్టుకొని మంగళ, బుధవారాల్లో వైద్య శిబిరం కొనసాగుతుందని తెలిపారు. 200 మందికి పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. ఎఫ్‌డీవో సుశాంత్ సుఖ్‌దేవ్, ఎఫ్ఆర్వో ముస్సావీర్, సింగరేణి ఎస్‌వోటూ జీఎం రాయ్‌మల్లి, పీఎం రెడ్డిమల్లు, వైద్యులు కాథాకృష్ణ, స్టాలిన్, శ్రీదేవి, అటవీ అధికార ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు, పారా మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

దండేపల్లి, మార్చి 4 : దండేపల్లి మండలం వెల్గనూర్ పరిధిలోని అందుగులపేట శివారులో ఏర్పాటు చేయనున్న సోలార్ ప్లాంట్‌కు సంబంధించిన స్థలాన్ని మంగళవారం డీఆర్డీవో కిషన్, తెలంగాణ రెనివబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్(రెడ్కో) సంస్థ మేనేజర్ శ్రీమన్నారాయణతో కలిసి పరిశీలించారు. ప్రభుత్వ స్థలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలనే ప్రభుత్వ నిబంధన మేరకే స్థలాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఎంపీడీవో ప్రసాద్, ఆర్ఐ భూమన్న, ఏపీఎం బ్రహ్మయ్య, ఐకేపీ సీసీలు, వీవోఏలు ఉన్నారు.

నెన్నెల, మార్చి4: సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు నెన్నెలలో అనుకూలమైన స్థలాన్ని టీజీఆర్ఈడీసీవో సాంకేతిక బృందం పరిశీలించింది. 657 సర్వే నంబర్‌లో నాలుగెకరాలు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించింది. ఇందులో రెడ్‌కో సంస్థ అధికారులు శ్రీమన్నారాయణ, డీఈర్డీవో కిషన్, ఎంపీడీవో దేవేందర్, ఏపీవో, ఆర్ఐ సులోచన సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ ప్రజావాణితో సమస్యల పరిష్కారం

మంచిర్యాలటౌన్, మార్చి 4 : విద్యుత్ ప్రజావాణి కార్యక్రమంతో వినియోగదారులకు మరింతచేరువై, సమస్యల పరిష్కారానికి మార్గం సుగమమవుతుందని మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ వీ గంగాధర్ పేర్కొన్నారు. విద్యుత్ ప్రజావాణిలో భాగంగా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు తీసుకొని వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు. 2024, జూన్ 17న ప్రారంభమైన ఈ ప్రజావాణి ప్రతీ సోమవారం సర్కిల్, డివిజన్, సెక్షన్ ఆఫీసుల్లో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రధానంగా విద్యుత్ బిల్లుల సమస్యలు, మీటర్ల సమస్యలు, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్యలు, కేటగిరీ మార్పు, పేరు మార్పు, ప్రమాదభరితంగా ఉన్న స్తంభాలు, తదితర ఫిర్యాదులు ఇప్పటి వరకు 565 అందాయని, వాటిలో 517 పరిష్కరిచామని వెల్లడించారు. ప్రతీ సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ కార్యాలయాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తామని, సర్కిల్ కార్యాలయంలో మాత్రం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఫిర్యాదులు స్వీకరిస్తామని వివరించారు.

పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, మార్చి 4 : శ్రీరాంపూర్ ఏరియాలోని రిటైర్డ్ కార్మికులకు రివైజ్డ్ పెన్షన్ పెండింగ్ క్లెయిమ్‌లు వెంటనే పరిష్కరించాలని ఆ వెల్ఫేర్ అసోసియేషన్ ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ కోరారు. మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. 11వ వేతన ఒప్పందం ప్రకారం శ్రీరాంపూర్ ఏరియాలో 1138 క్లెయిమ్‌ల వివరాలను గోదావరిఖని కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయ రీజినల్ కమిషనర్‌కు పంపించినట్లు తెలిపారు. 83 మందికిఆర్డర్లు ఇచ్చారన్నారు. ఏరియాలోని 2106 రిటైర్డ్ కార్మికులకు గాను, 1238 కార్మికుల వివరాలను ఫిబ్రవరి 19న సీఎం పీఎఫ్ కార్యాలయానికి ఫార్వర్డ్ చేసినట్లు వెల్లడించారు. 968 రిటైర్డ్ కార్మికుల వివరాలు పంపించాల్సి ఉందని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా శ్రీరాంపూర్‌లోనే ఇన్నిక్లెయిమ్ పెండింగ్‌లో ఉంటే మిగతా ఏరియాల్లో పరిస్థితి ఏంటటో అర్థంచేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం రివైజ్డ్ పెన్షన్, వాటి బకాయిలను త్వరగా ఇప్పించాలని కోరారు.

జోడేఘాట్ సందర్శన

కెరమెరి, మార్చి 4 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని టీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మంగళవారం జోడేఘాట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కుమ్రం భీం విగ్రహం వద్ద నివాళులర్పించి, ఆదివాసుల స్మారక మ్యూజియం సందర్శించారు. ఆదివాసుల ఆచారాలు, సంస్కృతీసంప్రదాయాలను పరిశీలించారు. కుమ్రం భీం చరిత్రను అడిగి తెలుసుకున్నారు.

వరి పంట పరిశీలన

కాసిపేట, మార్చి 4 : కాసిపేట మండలం ధర్మరావుపేటలో వరి పొలాలను మండల వ్యవసాయాధికారి చల్ల ప్రభాకర్ పరిశీలించారు. రైతులకు పలు సూచనలు చేశారు. పంట ప్రస్తుతం పిలక దశలో ఉందని, అక్కడక్కడా కాండం తొలుచు పురుగు పట్టిందని పేర్కొన్నారు. నివారణా చర్యలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

కౌటాల, మార్చి 4 :కౌటాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు చేసినట్లు ప్రిన్సిపాల్ బాలకిషన్ రావు తెలిపారు. కళాశాలలో 655 మంది (ఫసిటయర్ 310, సెకండియర్ 345) విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. 8.45కు ముందే కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందని తెలిపారు. సీఎస్‌గా ప్రిన్సిపాల్ బాలకిషన్ రావు, డీవోగా జ్ఞానేశ్వర్ విధులు నిర్వహించనున్నారు.

కాసిపేట, మార్చి 4 : కాసిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు కావాల్సిన సౌకర్యాలు కల్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు, మోడల్ కళాశాల విద్యార్థులు (జనరల్ విద్యార్థులు 193, ఒకేషనల్ విద్యార్థులు 37 మంది) పరీక్షలు రాయనున్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా సీహెచ్ రాజేశ్వరి, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌గా శ్రీనివాస్ విధులు నిర్వహిస్తున్నారు.

వాంకిడి, మార్చి 4 : వాంకిడి ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్ చంద్ర య్య తెలిపారు. కళాశాలలో బెంచిలపై హాల్ టికెట్ నంబర్లు వేసే ప్రక్రియ పరిశీలించారు. 400 మంది, 97 కేజీబీవీ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. డిపార్ట్‌మెంట్ అధికారిగా అత్మారాం నియమితులయ్యారు.

కేజీబీవీ పరిశీలన

కన్నెపల్లి, మార్చి 4 : భీమిని మండలంలోని కేజీబీవీని మండల ప్రత్యేకాధికారి జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. మెను ప్రకారం భోజనం అందించాలని సూచించారు. పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా స్నాక్స్ ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

హాజరుశాతం తగ్గకుండా చూడాలి

షట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో భోజనం పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

కోటపల్లి, మార్చి 4 : ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థుల హాజరుశాతం తగ్గకుండా చూడాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కోటపల్లి మండలం పంగిడిసోమారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. తరగతి గదులు, మధ్యాహ్న భోజనం, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధచూపాలని, ప్రతీ విద్యార్థి నిత్యం పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టిపెట్టాలని సూచించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లలతో మాట్లాడారు. గ్రామ పంచాయితీలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించి, ప్రజలకు అవసరమైన మొక్కలను పెంచాలని సూచించారు. వేసవికాలం దృష్ట్యా మొక్కలకు సకాలంలో నీరందించాలని సిబ్బందికి ఆదేశించారు. గ్రామంలో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలతో ప్రజలకు నిరంతరాయంగా సరఫరా చేయాలని కార్యదర్శి సత్యనారాయణను ఆదేశించారు. అక్కడి నుంచి షట్‌పల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పౌష్టికాహారం అందించాలని సూచించారు. గ్రామంలోని మురుగు కాలువల వ్యవస్థను పరిశీలించి, ఎప్పటికప్పుడు శుభ్రపర్చాలని, గ్రామంలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలిపారు. జీపీ కార్యాలయ భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

కాసిపేట : దేవాపూర్ సిమెంట్ కంపెనీలో భద్రత ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు

మందమర్రి, మార్చి 4 : రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ సూచించారు. 54వ జాతీయ భద్రతా వారోత్సవాలను పురస్కరించుకొని స్థానిక టోల్‌ప్లాజా వద్ద జాతీయ రహదారి అధికారులు నిర్వహించిన ప్రమాదాల నివారణ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించేందుకు, ప్రమాదాలు తగ్గించేందుకు 1971లో నేషనల్ సేఫ్టీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌సీ) ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ గతేడాది 363 జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదాల్లో బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో 54 మంది మృతిచెందారని వెల్లడించారు. వాహనాల డ్రైవర్లతో ప్రమాదాల నివారణ, రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. మందమర్రి సీఐ శశీధర్ రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, కాసిపేట ఎస్ఐ ప్రవీన్, జాతీయ రహదారి నిర్వహణ అధికారులు సునీల్, సిబ్బంది, డ్రైవర్లు పాల్గొన్నారు.

దేవాపూర్ సిమెంట్ కంపెనీలో..

కాసిపేట, మార్చి 4 : కాసిపేట మండలం దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కర్మాగారంలో జాతీయ భద్రతా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కంపెనీ యూనిట్ హెడ్ బాల గిరిధర్ జెండా ఆవిష్కరించి, వారోత్సవాలకు ప్రారంభించారు. దేశాభివృద్ధికి భద్రతా శ్రేయస్సు కీలకమన్నారు. డీఏవీ పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు, సిబ్బందికి వ్యాస రచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అనంతరం ఉద్యోగులు, కార్మికులతో ప్రతిజ్ఞ చేయించారు. 4 నుంచి 10వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలతో పాటు, భద్రతా పోటీలు జరుపుతామని ఓరియంట్ సిమెంట్ భద్రతా అధికారులు తెలిపారు. కంపెనీ సీనియర్ జీఎం ఆనంద్ కులకర్ణి, డీఏవీ ప్రిన్సిపాల్ కిరణ్, ఉపాధ్యాయులు, ఓరియంట్ సిమెంట్ భద్రతా అధికారులు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

జైపూర్, మార్చి 4 : ఎన్టీపీపీలో ఇన్‌చార్జి ఈడీ శ్రీనివాసులు రక్షణ జెండా ఎగురవేశారు. చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎం జైన్‌సింగ్, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ, సీఎంవోఏఐ బ్రాంచ్ సెక్రటరీ శ్రీనివాస్, పీఎంపీఎల్ ప్లాంట్ హెడ్ అఖిల్‌కపూర్, డీజీఎం పర్సనల్ తుకారాం పాల్గొన్నారు.

ఒత్తిడిలేని విద్యనందించడమే లక్ష్యం

మందమర్రి : మాట్లాడుతున్న సింగరేణి ఎడ్యుకేషనల్ సెక్రటరీ శ్రీనివాస్

మందమర్రి, మార్చి 4 : విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యనందించడమే లక్ష్యంగా సింగరేణి యాసమాన్యం ముందుకు సాగుతున్నదని, అందులో భాగంగానే విద్యాబోధనతో పాటు, యోగా, మెడిటేషన్‌లో శిక్షణ ఇస్తున్నట్లు సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ జీ శ్రీనివాస్ పేర్కొన్నారు. మందమర్రి పట్టణంలో సింగరేణి ఉన్నత పాఠశాలను ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయి సందర్భంగా నిర్వహించతలపెట్టిన స్వర్ణోత్సవ వేడుకల ఏర్పాట్లలో భాగంగా మంగళవారం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సింగరేణ ఆధ్వర్యంలో 9 పాఠశాలలు, మహిళా జూనియర్, డిగ్రీ కళాశాలతో పాటు, పాలిటెక్నిక్ కళాశాలలు కొనసాగుతున్నాయని వివరించారు. మందమర్రి పట్టణంలో సింగరేణి పాఠశాల స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నస్పూర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహస్వామి, సీసీసీ పాఠశాల హెచ్ఎం సంతోష్ దేశాయ్, మందమర్రి పాఠశాల హెచ్ఎం పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి పాఠశాల వార్షికోత్సవం

పట్టణంలోని సింగరేణి ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరి శ్రీనివాస్, ఏరియా జీఎం దేవేందర్, సేవా సమితి అధ్యక్షురాలు స్వరూపరాణి జ్యోతి ప్రజ్వనల చేసి ప్రారంభించారు. విద్యార్థుల ఆటపాటలు అలరించాయి. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటూ జీఎం విజయప్రసాద్, పాఠశాల కరస్పాండెంట్, ఏరియా పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, హెచ్ఎం పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సీసీసీ నస్పూర్, మార్చి 4 :సీసీసీ నస్పూర్‌లోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలను సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్ సందర్శించారు. యాజమాన్యం సింగరేణి విద్యా సంస్థల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, నరసింహస్వామి, వివిధ విభాగాధిపతులు రవీందర్, దామోదర్, సాంబమూర్తి, సుమన్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సైన్స్ డే

కాగజ్‌నగర్, మార్చి 4 : కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్లు ఎన్ రామస్వామి, వీ కిషన్ హాజరై విద్యార్థులకు సైన్స్ సంబంధిత అంశాలపై అనేక విషయాలను వివరించారు. దేశంలో ఇంకా అనేక పరిశోధనలు జరుగాల్సి ఉందన్నారు. సైన్స్‌లో వేగంగా పురోగతి సాధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ అవగాహన కలిగి ఉండాలని వివరించారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్స్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు నిర్వహించిన సైన్స్ ప్రదర్శనను తిలకించి, ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందించారు. క్విజ్, సాంస్కృతిక పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ కే శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ డీ లక్ష్మీనరసింహం, అకాడమిక్ కోఆర్డినేటర్ డీ జనార్దన్, అధ్యాపకులు రాజేశ్వర్, శారద, వీ దేవేందర్, బీ రోజుమేరీ, కృష్ణవేణి, వెంకటేశం పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

బెజ్జూర్, మార్చి 4 : మండలంలోని లంబాడిగూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి మడిసెట్టి శ్రీనివాస్ ఇంటి అనుమతుల కోసం లంచం అడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. జీపీ పరిధిలో కొత్తగా ఇంటి నిర్మాణాలు చేసుకునేందుకు అనుమతులు కావాలంటే రూ.10 వేల నుంచి రూ.50 వేల వరకు లంచం డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ఇవ్వకపోతే బెదిరింపులకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. అలాగే అందుబాటులో ఉండడంలేదన్నారు. ధృవపత్రాలు జారీలో ఆలస్యంచేస్తున్నాడని వాపోయారు. చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంపీడీవో, సంబంధిత అధికారులతో పాటు, కలెక్టర్‌కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు.

ఆర్వీయూఎన్ఎల్‌తో ఒప్పందం

శ్రీరాంపూర్, మార్చి 4 : రాజస్థాన్ రాష్ట్రంలోని ఆర్‌వీయూఎన్ఎల్ సంస్థతో సింగరేణి సంస్థ 3100 మెగావాట్ల సోలార్, థర్మల్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ మేరకు మంగళవారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాజస్థాన్ ఇంధన శాఖ మంత్రి హీరాలాల్ నగర్ సమక్షంలో సింగరేణి, రాజస్థాన్ విద్యుత్ ఉత్పాదన్ నిగమ్ లిమిటెడ్ అధికారులు ఒప్పందం చేసుకున్నారు. రాజస్థాన్ ఇంధన శాఖ అడిషనల్ చీఫ్ సెక్రటరీ అలోక్, తెలంగాణ రాష్ట్ర ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణ భాస్కర్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, సింగరేణి డైరెక్టర్ డీ.సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

కేకేవోసీలో వోల్వో వాహనాలు ఢీ..

మందమర్రి, మార్చి 4 : మందమర్రి ఏరియాలోని కేకే వోసీలో ఓబీ తరలిస్తున్న రెండు వోల్వో వాహనాలు ఢీ కొట్టుకోగా, తాండూర్‌కు చెందిన డ్రైవర్ మోత్కుల రాజేశంకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టాక్‌సైడ్ మిషన్ సెక్షన్ సమీపంలో మట్టి నింపిన వోల్వో వాహనం ముందుకు వెళ్లే క్రమంలో బ్రేకులు ఫెయిలయ్యాయి. వెనుకాల మరో వాహనం ముందు భాగంలో ఢీ కొట్టింది. మట్టిని లోడ్ చేస్తున్న వోల్వో వాహనం డ్రైవర్ రాజేశం తొంటికి గాయమవగా, కార్మికులు వెంటనే రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా దవాఖానకు తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని దవాఖానకు తీసుకెళ్లారు. కాగా, పనులు నిర్వహిస్తున్న ఆర్‌వీఆర్ సంస్థ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని కార్మికులు, యూనియన్ల నాయకులు ఆరోపిస్తున్నారు.

అధికారుల హాస్టల్ నిద్ర

తాండూర్, మార్చి 4 : మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకుల హాస్టల్‌లో మంచిర్యాల జిల్లా డీఐఈవో, మండల ప్రత్యేక అధికారి కటుకం అంజయ్య, ఎంపీడీవో శ్రీనివాస్ సోమవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేపట్టారు. అలాగే రాత్రి విద్యార్థులతో కలిసి అక్కడే బస చేశారు. వసతులను పరిశీలించడంతో పాటు విద్యార్థుల ప్రతిభాపాటవాలను పరీక్షించారు. అంతకుముందు విద్యార్థులకు పాఠాలు బోధించారు. వారితో భోజనం చేసి సదుపాయాల గురించి తెలుసుకున్నారు. రానున్న పదో తరగతి వార్షిక పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. మంచి మార్కులు సాధించి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు.

బెల్లంపల్లి, మార్చి 4 : మండల శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో సోమవారం రాత్రి ఎంపీడీవో మహేందర్ విద్యార్థులతో కలిసి నిద్రించారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మెనూ గురించి ఆరా తీశారు. కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషిచేయాలి

శ్రీరాంపూర్, మార్చి 4 : సింగరేణి ఉద్యోగులు, అధికారులు రక్షణ చర్యలు పాటిస్తూ ఉత్పత్తికి కృషిచేయాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఓసీపీ, క్యాంటీన్‌ను మంగళవారం సందర్శించారు. కార్మికులు, అధికారులు సమన్వయంతో ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని కోరారు. ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, పీవో టీ శ్రీనివాస్, మేనేజర్ బ్రహ్మాజీ, ఈ ఈ నాగరాజు, సీనియర్ పీవో శంకర్, అధికారుల సంఘం సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, పిట్ కార్యదర్శి లచ్చన్న, నాయకులు సతీశ్, శ్రీనివాస రాజేందర్ పాల్గొన్నారు.

ఫేర్‌వెల్ పార్టీ

దండేపల్లి : నృత్యం చేస్తున్న విద్యార్థులు

దండేపల్లి, మార్చి 4 : దండేపల్లి మండలం లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో మంగళవారం పదోతరతగతి విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్యాలు అలరించాయి. ప్రిన్సిపాల్ రామగిరి రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలని ఆకాంక్షించారు.

కన్నెపల్లి, మార్చి 4 : మండలంలోని జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఫేర్‌వెల్ పార్టీ ఘనంగా నిర్వహించారు. ఎంఈవో రాము హాజరయ్యారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కన్నెపల్లి : జన్కాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో..

ఆకట్టుకున్న రంగోళి

మందమర్రి, మార్చి 4 : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మందమర్రి పట్టణంలోని కార్మెల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన రంగోళి వేడుకలు ఆకట్టుకున్నాయి. 9, 10వ తరగతుల విద్యార్థులు పాల్గొని భౌతిక, రసాయనిక, జీవ శాస్త్రాల పాఠ్యాంశాల్లోని నమూనాలను ముగ్గుల రూపంలో ప్రదర్శించారు. అనంతరం హెచ్ఎం ఫాదర్ జేవీఆర్ రెక్స్ పరిశీలించి, విద్యార్తులను అభినందించారు. విజేతలకకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు ఎం కుమారస్వామి, జీవశాస్త్ర